క్లుప్తంగా

రంజాన్ శుభాకాంక్షలు


బుట్టా రేణుక

ఎమ్మిగనూరుటౌన్: నియోజకవర్గంలోని ముస్లింలకు వైఎస్సార్‌సీపీ నియోజక వర్గ ఇన్‌చార్జ్ బుట్టా రేణుక రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. నెలరోజుల పాటు నిష్ఠతో ఉపావస దీక్షలుండి సోమవారం ఈదుల్‌ఫిత్ర్ జరుపుకొంటున్న ముస్లింలందరూ సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

చెన్నకేశవ స్వామిని దర్శించుకున్న ప్రదీప్ రెడ్డి


స్వామి వారిని దర్శించుకున్న వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వై. ప్రదీప్ రెడ్డి

కోసిగి: దేవనకొండ మండలం కప్పట్రాళ్ల గ్రామ రిజర్వ్ ఫారెస్ట్‌లో వెలసిన కొలుట్ల చెన్నకేశవ స్వామిని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వై. ప్రదీప్ రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసుకున్నారు. ఆదివారం నూతన తెలుగు సంవత్సర విశ్వావసు నామ సంవత్సర ఉగాది పండుగను పురస్కరించుకుని స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ఆలయ అర్చకులు స్వామి మంగళహారుతులు గావించి ఫల,పుష్పాలు అందజేశారు. ఆయన వెంట ఆదోని విష్ణవర్ధన్ రెడ్డి, ఎమ్మిగనూరు కాంత రెడ్డి ఉన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం


దాతకు తీర్థప్రసాదాలను అందజేస్తున్న దృశ్యం

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకంద గ్రామంలో వెలసిన ఈరన్న స్వామి దేవాలయం వద్ద ఇటీవల ప్రతిష్ఠించిన లక్ష్మి అమ్మవారి మంటపం (ఆలయ) అభివృద్ధి కోసం ఆదివారం భక్తులు విరివిగా విరాళాలు అందజేసి తమ భక్తిని చాటుకున్నారు. ఆదోని వాస్తవ్యులైన విజయలక్ష్మి, ఈరన్న దంపతులు వారి కుటుంబ సభ్యులు రూ.50వేల నగదు రూపంలో అందజేసినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ విజయరాజు తెలిపారు. దాతలకు ఆలయ అధికారులు సంప్రదాయం ప్రకారం స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలను చేయించి స్వామి వారి తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు ఈరప్పస్వామి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

నందవరం : ఏప్రిల్ 4న కర్నూలులో చేపట్టే జాతీయ రైతు సదస్సును జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంపన్న గౌడ్ పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రం నందవరం బస్టాండ్ ఆవరణలో ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో ఆ సంఘం నాయకులు ప్రచార జీపు జాతా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాస్కర్‌యాదవ్, గిడ్డయ్య, మాలిక్, శాంతప్ప, ముని, నరసప్ప తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ అధికారులపై దాడులు చేస్తే చర్యలు తీసుకోవాలి

ఆదోని రూరల్: విధి నిర్వహణలో ఉన్న రెవెన్యూ అధికారులపై దాడులకు దిగే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ ఆదోని డివిజన్ అధ్యక్షుడు కె.రజనీకాంత్‌రెడ్డి, కార్యదర్శి పి.వలిబాషా డిమాండ్ చేశారు. ఆదివారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. శనివారం సి.బెళగల్ మండలంలో పనిచేస్తున్న వీఆర్వో వెంకటేశ్వర్లుపై టీడీపీ కార్యకర్త భౌతికంగా దాడికి పాల్పడిన సంఘటన మరిచిపోక ముందే పెద్దకడబూరు తహసీల్దార్‌పై సీపీఐ నాయకుడు బి.వీరేష్ అసభ్యకరంగా మాట్లాడడంతో పాటు కార్యాలయంపై దాడికి యత్నించడం ఏమిటని ప్రశ్నించారు. ఈ ఘటనలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సమావేశంలో అసోసియేట్ ప్రెసిడెంట్ కె.రాఘవేంద్ర, సహధ్యక్షులు జర్మియా, రుద్రగౌడ్, మహేష్ పాల్గొన్నారు.

ఉగాది పురస్కారం


పురస్కారం అందుకుంటున్న అర్చకుడు రంగనాథచార్యులు

ఆదోని సెంట్రల్: పెరవలి గ్రామంలోని శ్రీరంగనాథస్వామి దేవస్థానం ముఖ్య అర్చకులు రొముండూరి రంగనాథచార్యులు ఆదివారం జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఉగాది పురస్కారం అందుకున్నారు. ఆయన చేసిన సేవలను గుర్తించి ప్రభుత్వం పురస్కారం అందించింది. ఆయనను ఆదోనిలోని రంగనాథస్వామి భక్తులు, ప్రముఖులు అభినందించారు.

మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభం

కౌతాళం: ఉరుకుంద ఈరన్న స్వామి దర్శనానికి వచ్చే భక్తులకు ఫిల్టర్ వాటర్ సౌకర్యం కల్పించారు. ఆలయంలో రూ.10లక్షలతో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను ఆదివారం ఆలయ డిప్యూటీ కమీషనర్ విజయరాజు ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ వేద పండితుడు మురళీకృష్ణ శర్మ, పర్యవేక్షకులు మల్లికార్జున, వెంకటేశ్వరరావు, ప్రధాన అర్చకుడు ఈరప్పస్వామి పాల్గొన్నారు.


సుంకులమ్మవ్వకు పూజలు చేసిన భక్తులు


ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న మారెమ్మవ్వ



ప్రత్యేకాలంకరణలో గురజాల రామలింగేశ్వర స్వామి, పార్వతీ దేవి



అమ్మవారి దర్శనానికి క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు, గోనెగండ్లలో దున్నపోతును ఊరేగిస్తున్న దృశ్యం

ఊరూరా ఉగాది సంబరాలు

- ఆలయాల వద్ద కిక్కిరిసిన భక్తులు
- అమ్మవార్లకు ప్రత్యేక పూజలు
- ఆలయాల్లో పంచాంగ శ్రవణాలు

ఆదోని అర్బన్: ఉగాది పండగను ఊరూరా ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలో సుంకులమ్మవ్వ, మారెమ్మవ్వ దేవాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామునే పిండి వంటలు చేసుకుని సుంకులమ్మవ్వ, మారెమ్మవ్వ వార్లకు పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. పట్టణంలోని చిన్నమార్కెట్‌లో వెలిసిన సుంకులమ్మ, మారెమ్మవ్వ, ఇస్వీ రోడ్డు, ఎమ్మిగనూరు రోడ్డు, ఆస్పరి రోడ్డులో వెలిసిన అమ్మవార్లకు, స్వామివార్లకు పూజలు నిర్వహించారు. భక్తుల రాకతో ఆలయాలు కిటకిటలాడాయి.

పంచాంగ శ్రవణం

కొత్త సంవత్సరం ఉగాది సందర్భంగా పట్టణంలోని విశ్వహిందూ పరిషత్, ఆయా దేవాలయాల్లో విశ్వావసు నామసంవత్సరం గురించి పంచాంగ శ్రవణం వేద పండితులు తెలియజేశారు. ఈ ఏడాది వర్షాలు సాధారణంగా ఉన్నా మంచి పంటలు వస్తాయని, సుఖసంతోషాలతో ఉంటారని తెలియజేశారు. అనంతరం రాశులు, నక్షత్రాల గురించి తెలియజేశారు.


ముగతిలో ప్రభోత్సవం నిర్వహిస్తున్న భక్తులు


గోనెగండ్లలో పూర్ణకుంభాలతో వెళ్తున్న దృశ్యం

వైభవంగా ఉగాది ఉత్సవాలు

నందవరం: తెలుగు సంవత్సరం విశ్వావసు నామ సంవత్సరాది ఉగాది ఉత్సవాలను ఆదివారం మండలంలో ప్రజలు అత్యంత వైభవంగా జరుపుకున్నారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని మండల కేంద్రం నందవరం, ముగతి, కనకవీడు, సోమలగూడూరు, నాగలదిన్నె, నదికైరవాడి, గురజాల తదితర గ్రామాల్లోని దేవాలయాల్లో దేవతా మూర్తులకు ఉదయం పిండి వంటలతో భక్తులు నైవేద్యాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. దక్షిణ కాశీగా పేరుగాంచిన గురజాల రామలింగేశ్వర స్వామి ఆలయంలో పూజారి హంపేష్ స్వామి ఆధ్వర్యంలో రాలింగేశ్వరుడికి, పార్వతీ మాతకు ప్రత్యేక అలంకరణ గావించి విశిష్ట పూజలు చేపట్టారు. పంచామృతాభిషేకాలు, మహామంగళ హారతు పట్టారు. అలాగే సోమలగూడూరు గ్రామంలో శివాలయంలో పురోహితులు శ్రీధర్ స్వామి ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం చేశారు. ముగతి గ్రామంలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రభోత్సవం నిర్వహించారు. ఉత్సవాలల్లో ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

గోనెగండ్లలో వేడుకలు

గోనెగండ్ల : స్థానిక అంజినేయ స్వామి దేవాలయంలో వీరశైవ పీఠాధిపతి శివయ్య స్వామి పంచాంగ శ్రావణంలో రాశిఫలాలు, గ్రహ స్థితిగతులను వినిపించారు. పండుగ సందర్భంగా జీవిత మాధుర్యాన్ని తెలిపే ఉగాది పచ్చడిని కుటుంబ సమేతంగా ఆరగించారు. ఉగాది పండుగను పురస్కరించుకొని గోనెగండ్లలోని మారేమ్మ దేవాలయం వద్ద ఆదివారం తెల్లవారు జామున 3 గంటల నుంచి 6 గంటల వరకు దున్న పోతులను తప్పెట్ల మోత నడుమ గ్రామస్తులు ఊరేగించారు.

గోనెగండ్లలో వైభవంగా ప్రభోత్సవం

మండల కేంద్రంలో ఉగాది పండుగా పర్వదినాన్ని పురస్కరించుకుని సాయంత్రం స్థానిక ఆంజనేయ స్వామి వారి ఉత్సవమూర్తిని రథంలో కొలువుంచి ప్రత్యేకంగా అలంకరించి, ఆంజినేయస్వామి దేవాలయం నుంచి ఊరేగింపుగా శివాలయం దేవాలయం వరకు తీసుకెళ్లి తిరిగి యథాస్థానానికి చేర్చారు.


గోనెగండ్లలో ప్రభను ఊరేగింపుగా తీసుకెళ్తున్న దృశ్యం

ఆకట్టుకున్న పోటీలు


కోడి పుంజులు పోట్లాడుతున్న దృశ్యం

నందవరం : మండల పరిధిలోని జోహరాపురం గ్రామంలో విశ్వావసు నామ సంవత్సవరం ఉగాది పండుగను పురస్కరించుకని గ్రామ దేవర సంబరాలలో భాగంగా ఆదివారం పొట్టేళ్ల, కోడిపుంజుల పోటీలు నిర్వహించారు. భక్తులు బోనాలు సమర్పించే కార్యక్రమంలో భాగంగా ఈ పోటీలు ఏర్పాటు చేశారు. పెద్ద పెద్ద పొట్టేళ్లు, కోడిపుంజులతో సాగిన పోట్లాట (పోరు) చూపరులను ఆకట్టుకుంది.

ఉగాది, రంజాన్ శుభాకాంక్షలు


సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్

ఆదోని రూరల్: ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్ డివిజన్ ప్రజలకు తెలుగు నూతన సంవత్సరాది ఉగాది, రంజాన్ పండగ శుభాకాంక్షలు తెలియజేశారు. స్థానిక కార్యాలయంలో సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ తెలుగు నూతన సంవత్సరాది శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది పర్వదినం ప్రజలందరికీ ఈ ఏడాది కలిసి రావాలన్నారు. ఈ ఏడాది సమృద్ధిగా పంటలు పండాలని, వర్షాలు కురవాలని, రైతులకు మేలు కలగాలని, అన్నివర్గాల ప్రజలు ఆనందంగా ఉండాలని ఆకాంక్షించారు. అదేవిధంగా పవిత్ర దివ్యఖురాన్ అవతరించిన రంరజాన్ మాసంలో నెలరోజులపాటు కఠోర ఉపవాస దీక్షతో నిష్ఠగా అల్లాను ఆరాధిస్తూ ఆధ్యాత్మిక జీవనం గడిపిన ముస్లిం సోదర, సోదరీమణులందరికీ రంజాన్ పండగ శుభాకాంక్షలు తెలియజేశారు. క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతనల కలయికే రంజాన్‌మాసం విశిష్టత అని అన్నారు. అల్లాహ్ దీవెనలతో డివిజన్ ప్రజలకు సకల శుభాలు కలగాలని సబ్‌కలెక్టర్ ఆకాంక్షించారు.

వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పంచాంగ శ్రవణం


ఎమ్మిగనూరు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పంచాంగం వినిపిస్తున్న వేద పండితుడు, పాల్గొన్న బుట్టా శివనీలకంఠ, పార్టీ నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: విశ్వవసు నామసంవత్సర ఉగాదిని పురస్కరించుకొని పట్టణంలోని ప్రధాన ఆలయాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి పూజలు చేపట్టారు. ఇందులో భాగంగా శిల్పా ఎస్టేట్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సాయంత్రం ఉగాది వేడుకను ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టారేణుక భర్త బుట్టా ఫౌండేషన్ అధినేత బుట్టాశివనీలకంఠ ప్రత్యేక పూజ చేశారు. అనంతరం వేద, జ్యోతిష్య పండితుడు బి. నట్‌రాజ శాస్త్రి తెలుగు విశ్వవసు పంచాంగాన్ని వినిపించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గడ్డం లక్ష్మీ నారాయణరెడ్డి, మాచాని వెంకటేష్, వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, యూకే రాజశేఖర్, కామర్తి నాగేషప్ప, సునీల్‌కుమార్, మల్లికార్జున రెడ్డి, కౌన్సిలర్ నీలకంఠ పాల్గొన్నారు.

హోరాహోరీగా ఎద్దుల గిరక లాగుడు పోటీలు


గెలుపొందిన ఎద్దుల రైతుకు నగదు మెమొంటో అందజేస్తున్న వినాయక వారియర్స్ యూత్ సభ్యులు

కోసిగి: మండల పరిధిలోని సజ్జలగుడ్డం గ్రామంలో ఉగాది పండుగ పర్వదినాన్ని పురస్కరించుకుని గ్రామ వినాయక వారియర్స్ యూత్ ఆధ్వర్యంలో ఎద్దుల బండి గిరక లాగుడు పోటీలు నిర్వహించారు. ఆదివారం ఉదయం గ్రామంలో పోటీలకు 13 జతల ఎద్దులు పాల్గొన్నాయి. ఇందులో సూగూరు నరసింహులకు చెందిన ఎద్దులు గెలుపొందాయి. గెలుపొందిన ఎద్దుల యజమానికి యూత్ సభ్యులు రూ.15,116 నగదు మెమొంటో అందజేశారు. కార్యక్రమంలో వీవీఎస్ యూత్ సభ్యులు గర్జప్ప, హనుమంత రెడ్డి, భీమేష్, సూర్యప్రకాష్, సిద్ధ రమేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

కంబదహాల్‌లో ఎద్దుల గిరక పోటీలు

పెద్దకడబూరు : మండల పరిధిలోని కంబదహాల్ గ్రామంలో ఆంజనేయ స్వామి జాతరను పురస్కరించుకుని ఎద్దుల గిరక పోటీలు నిర్వహించారు. ఆదివారం పోటీలకు 10 జతల ఎద్దులు పోటీలలో పోటీ పడ్డాయి. ఇందులో మొదటి స్థానంలో హనుమాపురం గ్రామానికి చెందిన గోవిందు, రెండవ స్థానంలో కంబాలదిన్నె గ్రామానికి చెందిన గజ్జల పెద్ద ఉసేని ఎద్దులు, మూడవ స్థానంలో మురుగేని వెంకటేష్ వృషభాలు గెలుచుకున్నాయి. ప్రథమ బహుమతి కంపాడు పురుషోత్తం రెడ్డి రూ.15వేలు, రెండోవ బహుమతికి రూ. 10వేలు సాయి కిరణ్ రెడ్డి అందించారు. మూడవ బహుమతి గ్రామస్తులు రూ.5వేలు అందజేశారు. కార్యక్రమంలో ప్రభుకిశోర్ రెడ్డి, వంశీకృష్ణ రెడ్డి, సర్పంచ్ దస్తగిరి, పెద్ద దస్తగిరి, వరస్వామి, రంగస్వామి, పరమేష్ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఐక్యతతో పార్టీని మరింత బలోపేతం చేద్దాం


బుట్టా శివనీలకంఠను సత్కరిస్తున్న నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ శ్రేణులంతా ఐక్యతతో వుండి పార్టీని మరింత బలోపేతం చేసుకుందామని వైఎస్సార్‌సీపీ నాయకుడు, బుట్టా ఫౌండేషన్ అధినేత బుట్టా శివనీలకంఠ పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియామకమైన గడ్డం లక్ష్మీనారాయణరెడ్డి, చేనేత విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియామకమైన మాచాని వెంకటేష్ ఆదివారం స్థానిక కార్యాలయంలో ఆయనను కలిసి సత్కరించారు. తమకు పదవులను కల్పించిన నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టారేణుకకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, పార్టీ పట్టణ అధ్యక్షుడు కామర్తి నాగేషప్ప, బీసీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ముగతి విరూపాక్షిరెడ్డి, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి యూకే రాజశేఖర్ తదితరులు ఆయనకు ఉగాది, రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

మహిళ ప్రాణాలు కాపాడిన వైఎస్సార్‌సీపీ నేత


ట్రాక్ వద్ద నుంచి తల్లీబిడ్డను తరలిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి శ్రీలక్ష్మి

ఆదోని అర్బన్: రైల్వే ట్రాక్‌పై ఉన్న తల్లి, బిడ్డ ప్రాణాలను వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి శ్రీలక్ష్మి కాపాడారు. కుటుంబ కలహాలతో రాయ్‌నగర్ సమీపంలో నివాసముంటున్న రేణుక, కూతురులో కలిసి ఆదివారం ఆత్మహత్య చేసుకునేందుకు రైల్వే ట్రాక్ వద్దకు చేరుకుంది. అటుగా వెళ్తున్న పిల్లలు గమనించిన ఎంత చెప్పినా రాకపోవడంతో వెంటనే రాయ్‌నగర్‌లో ఉంటున్న వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి శ్రీలక్ష్మి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఆమె అక్కడికి చేరుకుని సదరు మహిళ, కుమార్తెకు సర్ది చెప్పారు. సమస్యకు చావే పరిష్కారం కాదని, జీవితం చాలా విలువైనదని తెలియజెప్పారు. అక్కడి నుంచి తల్లి, కుమార్తెను స్థానిక ఆలయం వద్దకు చేరుకున్నారు. వెంటనే శ్రీలక్ష్మి వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదు చేయడంతో సీఐ శ్రీరామ్ కానిస్టేబుల్‌ను పంపి ఆమెను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ వీడియో వాట్సాప్‌లో వైరల్ కావడంతో శ్రీలక్ష్మిని పలువురు అభినందించారు.

ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే అక్రమ కేసులా?

పెద్దకడబూరు : ప్రజా సమస్యలకు పరిష్కారం చూపాలని శాంతియుతంగా అడిగితే అక్రమ కేసులు పెడతారా అని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు భాస్కర్ యాదవ్, సీపీఐ మండల కార్యదర్శి వీరేష్, ఏఐవైఎఫ్ తాలూకా అధ్యక్షులు జాఫర్, రైతు సంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు ఆంజనేయులు ప్రశ్నించారు. వారు మాట్లాడుతూ.. తిమ్మక్కకు గత ప్రభుత్వంలో పొజిషన్ సర్టిఫికేట్ జారీ చేసింది. స్థలానికి సంబంధించి పొజిషన్‌కు హద్దులు చూపమని గత నాలుగు నెలలుగా తిరుగుతున్నా పట్టించుకోలేదన్నారు. ఈ విషయంపై ఇన్‌చార్జ్ తహసీల్దార్ గీతా ప్రియాదర్శినిని అడిగినందుకు సీపీఐ నాయకులపై దుర్భాషలాడి, నాయకుడు వీరేష్‌పై కేసు పెట్టడం ఏమిటని ఆరోపించారు.

వైభవంగా పల్లకోత్సవం


అమ్మవారి పల్లకీని ఊరేగిస్తున్న భక్తులు

ఆదోని అర్బన్: శ్రీ విశ్వావసు నామ సంవత్సరం ఉగాది పండగ సందర్భంగా ఆదివారం పట్టణంలోని కిలిచినపేటలో వెలిసిన శ్రీ అంబాభవానీ దేవాలయం (పెద్ద శక్తి గుడి)లో అమ్మవారి పల్లకిని పురవీధులగుండా ఊరేగించారు. ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ముందుగా అంబా భవానీమాతకు పంచామృతాభిషేకం, పూల అలంకరణ, నైవేద్యం, మహామంగళహారతి తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం పురవీధుల్లో చిన్నారులు, మహిళలు కలశాలతో డోలు సన్నాయిల మధ్య పల్లకి సేవ నిర్వహించారు.

మొక్కజొన్న పంట, గడ్డివామి దగ్ధం

గోనెగండ్ల : మండల పరిధిలోని చిన్నమరివీడు గ్రామంలో ఆదివారం సాయంత్రం రెండు ఎకరాల మొక్కజొన్న పంట దిగుబడి, ఒక గడ్డి వామి దగ్ధం అయ్యాయి. గుల్లమొరుసు గ్రామానికి చెందిన బోయ రామాంజికి చిన్నమరివీడు గ్రామ సమీపంలో నాలుగు ఎకరాల భూమి ఉంది. ఇప్పటికే రెండు ఎకరాల భూమిలో మొక్కజొన్న పంటను కోసి అమ్మకాలు జరిపాడు. ఇంకా రెండు ఎకరాల పంట పొలంలోనే ఉంది. దీనితో పాటు ఎద్దుల కోసం పొలం దగ్గరే గడ్డి వామిను ఏర్పాటు చేశాడు. ఆదివారం సాయంత్రం ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు పంటకు నిప్పు అంటించారు. మంటలు చెలరేగడంతో గమనించిన గ్రామస్తులు వాటిని ఆర్పివేసేందుకు ప్రయత్నం చేసినా అదుపుకాలేదు. దీంతో రామాంజికి చెందిన గడ్డి వాము, రెండు ఎకరాల మొక్కజొన్న పంట పూర్తిగా దగ్ధం అయ్యింది. దీంతో దాదాపు రూ.2లక్షలు ఆస్తినష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు. నష్టపోయిన రైతును ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

యూట్యూబర్‌పై కేసు నమోదు

ఆదోని అర్బన్: పట్టణంలోని జనంకోసం (జేకే న్యూస్) యూట్యూబర్ విజయరాజుపై వన్‌టౌన్ పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. ఈనెల 26న రాయ్‌నగర్‌లో చోటు చేసుకున్న ఘటనపై శాంతమ్మ, ఈరమ్మ ఎమ్మెల్యేపై దుర్భాషలాడినందుకు, వారిద్దరితో పాటు దుర్భాషలాడిన వీడియోను తీసి వైరల్ చేసినందుకు జె.కె.న్యూస్ యూట్యూబర్ విజయరాజుపై కూడా కేసు నమోదు చేసినట్లు తెలిపారు. బీజేపీ నాయకురాలు భాగ్యలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు వారిపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు తెలియజేశారు.

షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని శారద కమిటీ స్కూల్ వద్ద శనివారం అర్ధ రాత్రి చీరల వ్యాపారం చేసే కొండాపురి హనీఫ్ ఇంట్లో షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం జరిగింది. దీంతో ఇంట్లోని సామగ్రీతో పాటు చీరలు కాలిబూడిదయ్యాయి. రాత్రి నమాజ్ కోసం మసీదుకు వెళ్లిన సమయంలో అగ్నిప్రమాదం జరిగి ఇంట్లో అన్ని వస్తువులు కాలిపోయి తీవ్రంగా నష్టపోయినట్లు బాధితుడు వాపోయాడు. బాధిత కుటుంబానికి కౌన్సిలర్ ఇషాక్ ఆర్థిక సహాయం అందించారు.

క్రీడలతో ప్రతిభ చాటుకునే అవకాశం


క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న బసిరెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: క్రీడలతో క్రీడాకారులు తమలో దాగివున్న ప్రతిభను చాటుకోనే అవకాశం ఉందని వైఎస్సార్‌సీపీ నాయకుడు బసిరెడ్డి అన్నారు. గుడ్‌ఫ్రైడేను పురస్కరించుకొని మండల పరిధిలోని బనవాసి గ్రామంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బీఆర్ బసిరెడ్డి, గ్రామ సర్పంచ్ నల్లారెడ్డిల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన మోహన్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, రాంబాబు, టోర్నీ నిర్వాహకులు పాల్గొన్నారు.

నేడు ఈద్ ఉల్ ఫిత్ర్

- ముగిసిన రంజాన్ మాసం
- ఉపవాస దీక్షలను విరమించిన ముస్లింలు
- నేడు సామూహిక ప్రార్థనలకు ముస్తాబైన ఈద్గాలు, మసీదులు


పట్టణంలోని కమిటీ రోడ్డులో రంజాన్ నమాజు కోసం సిద్ధం చేసిన ఈద్గా

ఎమ్మిగనూరుటౌన్: వరాల వసంతం, శుభాల సరోవరం రంజాన్ మాసం ముగిసింది. సర్వమానవళికి కారుణ్యవర్షిణి అయిన రంజాన్ మాసం దైవానుగ్రహాలను ప్రపంచ మానవులకు పంచి పెట్టి వెనుదిరిగింది. నెలవంక దర్శనంతో నెలరోజుల కఠోర ఉపవాస దీక్ష ముగిసిన నేపథ్యంలో సోమవారం ఈద్ ఉల్ ఫిత్ర్ (రంజాన్) పండుగను జరుపుకునేందుకు ముస్లింలు సిద్ధమయ్యారు. పట్టణంలోని ఈద్గాలు, మసీదుల్లో ప్రత్యేక నమాజ్ చేసుకునేందుకు సిద్ధం అయ్యాయి. కఠోర ఉపవాస దీక్షలు, తరావి నమాజ్ చదివి సన్మార్గంలో నడిచి ఫిత్ర, సద్ఖాల (దానం) పేరుతో అభాగ్యులను ఆదరించడంతో పాటు శాంతి సామరస్యాలను సంతోషాన్ని పెంపొందింపజేయడమే ఈద్ ఉల్ ఫిత్ర్ అందిస్తున్న సందేశం. పట్టణంలోని ఆయా ప్రార్థనా మందిరాల వద్ద మున్సిపల్ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోగా.. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పట్టణ పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు.


ముస్తాబైన ఆదోని జామీయ మసీదు

పండుగకు ముస్తాబైన మసీదులు

ఆదోని సెంట్రల్: రంజాన్ పండుగకు మసీదులు ముస్తాబయ్యాయి. విద్యుద్దీపాలతో అలంకరించిన జామీయ మసీదు చూపరులను ఎంతగానో ఆకట్టుకుంటోంది. పట్టణంలోని జామియా మసీదు, చందశా దర్గా, ఇమామ్ దర్గా, గుల్బరోజ్ దర్గాతో పాటు పలు దర్గాలను అలంకరించారు.

ఘనంగా గ్రామ దేవర


మిట్టసోమపురంలో లింగమయ్య స్వామి కుంభోత్సవంలో భక్తులు

నందవరం : మండలంలో విశ్వావసు నామ తెలుగు సంవత్సరం ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లో దేవరలు కడు వైభవంగా జరిగాయి. మండలంలోని జోహరాపురం, మిట్టసోమపురం గ్రామాలలో గ్రామ దేవతలకు కుంభాభిషేకాలు, దేవర నిర్వహించారు. జోహరాపురం గ్రామంలో మారెమ్మవ్వ, సుంకులమ్మవ్వకు భక్తులు భోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే మిట్టసోమపురం గ్రామంలో లింగమయ్య స్వామికి భక్తులు కుంభాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు తెలుగు లక్ష్మీదేవి, శివన్న, ఎంపీటీసీ విజయమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కృష్ణావధూత స్వామి ప్రభోత్సవం


భక్తుల మధ్య కృష్ణావధూత స్వామి ప్రభోత్సవం


ఓరుగట్టు ఆంజనేయస్వామి ప్రభోత్సవం

కోసిగి: మండల పరిధిలోని వందగల్లు గ్రామ ప్రజల ఆరాధ్య దైవం శ్రీ కృష్ణావధూత స్వాముల మహా ప్రభోత్సవం ఆదివారం సాయంత్రం వేలాది మంది భక్తుల మధ్య కనుల పండువగా సాగింది. విశ్వావసు నామ సంవత్సరం ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని వేకువ జామున నుంచి ఆర్లబండ అంబా భవాని ఆలయ పీఠాధిపతులు శ్రీ మఠ్రిస్వామిల ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం గ్రామంలో తలారి వెంకయ్య ఇంటి నుంచి పూర్ణకుంభాన్ని మహిళలు ఊరేగింపుగా ఆలయం చెంతకు చేరుకున్నారు. స్వామి వారికి పూజలు చేసి పీఠాధిపతులు మఠ్రిస్వామికి నాణేలతో 17వ తులభారాన్ని భక్తులు నిర్వహించారు. అనంతరం పీఠాధిపతులను మహా ప్రభపై కూర్చొబెట్టి స్వామి వారి పాదాల వరకు లాగి తిరిగి యథా స్థానానికి చేర్చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ పెద్దలు కాల్వ లక్ష్మయ్య, మజ్జిగ లక్ష్మన్న, నాడుగేని వీరారెడ్డి, నడిపి హనుమంతు, సాబువలి తాత తదితరులు పాల్గొన్నారు.

కాళికా దేవి విగ్రహ ఊరేగింపు

మండల కేంద్రంలోని కడపాళెంవీధిలో వెలసిన కాళికాదేవి ఆలయంలో అర్చకులు గోపాలాచారి స్వామి ఆధ్వర్యంలో అమ్మవారిని విశేష పూజలు చేపట్టారు. సాయంత్రం అమ్మవారి ప్రతిమను రథంపై కొలువుంచి పురవీధులగా గుండా ఊరేగించారు.

ఓరుగట్టు ఆంజనేయ స్వామి ప్రభోత్సవం

కోసిగి: మండల పరిధిలోని దుద్ది గ్రామ పొలాల్లో వెలసిన ఓరుగట్టు ఆంజనేయ స్వామి వారి ప్రభోత్సవం ఆదివారం సాయంత్రం భక్తుల మధ్య కమనీయంగా సాగింది. ఆలయ అర్చకులు మహాదేవప్ప తాత, బసవరాజు తాత ఆధ్వర్యంలో స్వామి వారికి వేకువ జామున నుంచి ప్రత్యేక పూజలు చేపట్టారు.